సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



ఆదివాసీ మహిళకు ఎంతకష్టం

పురుటినొప్పలతో తల్లడిల్లిన ఓ ఆదివాసీ మహిళ వద్దకు 108 సిబ్బంది వాగుదాటి వచ్చారు. వానలోనే గొడుకు కింద పురుడు పోసి తల్లీబిడ్డను కాపాడారు. 8లో▸



కొండా లక్ష్మణ్‌బాపూజీకి నివాళి

స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కవితను కలిసిన రామన్న



కవితతో ఎమ్మెల్యే రామన్న, ఎంపీపీ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్/బోథ్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎంపీపీ శ్రీనివాస్ గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సంతోష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బెడుద్కర్ సంతోష్‌కుమార్ గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్‌ను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. జాతీయస్థాయి అవార్డు అందుకోవడం జిల్లాకు గర్వకారణమని అభినందించారు. అడిషనల్ కలెక్టర్ కుష్బూ గుప్తా, డీఈవో ప్రణీత తదితరులున్నారు.

16నుంచి ఓపెన్‌స్కూల్ పబ్లిక్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: 2023 సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు అక్టోబర్ 16నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 30నుంచి నవంబర్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పొందిన అభ్యాసకులు గమనించి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: తమను రెగ్యులరైజ్ చేయాలని క్షయ నిర్మూలన కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఒప్పంద ఉద్యోగులు గురువారం రిమ్స్‌లోని ఆ విభాగం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదని, అరకొర వేతనాలే చెల్లిస్తున్నారని వాపోయారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నవీద్, ప్రమోద్, సౌజన్య, నాగభూషణం తదితరులున్నారు.

వర్షంలోనూ ఎండీఎం కార్మికుల నిరసన




వర్షంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

కైలాస్‌నగర్: పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె రెండోరోజుకు చేరింది. గురువారం వర్షాన్ని లెక్కచేయకుండా కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు కుంటాల రాములు మాట్లాడుతూ.. ఏళ్లుగా పనిచేస్తున్న ఎండీఎం కార్మికుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలతో పాటు కోడిగుడ్ల బిల్లులు కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు సత్వరమే పరిష్కరించని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉమ్మడి జిల్లాలో జనాభా వివరాలు

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం
2001లో..	12,50,958	12,37,045	24,88,003
2011లో..	13,69,597	13,71,642	27,41,239



అతివలే అధికం

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన జనాభా
- 2011 గణనలో మొదటిసారి పైచేయి
- స్థానిక సంస్థల రిజర్వేషన్లతో రాజకీయాల్లో పలువురి స్థిరత్వం
- చట్టసభల్లోనూ ప్రాతినిధ్యం లభిస్తే మరింత ముందడుగు

సాక్షి, ఆదిలాబాద్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చర్చ సాగుతోంది. ఇదే సందర్భంలో జనగణన, లోకసభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశాలపైనా చర్చ మొదలైంది. ప్రస్తుతం బిల్లు ఆమోదం పొందినా పైన పేర్కొన్న రెండు అంశాల ప్రక్రియ పూర్తయిన తర్వాతే మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చే పరిస్థితి ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాగా.. 2021లో దేశంలో జనగణన కరోనా కారణంగా జరగకపోవడంతో ప్రస్తుతం 12 ఏళ్ల కిందటి లెక్కలనే పరిగణనలోకి తీసుకుంటున్నారు. 16సార్లు జనగణన జరగగా, చివరిది మినహాయిస్తే అంతకుముందు జరిగిన అన్ని గణనల్లో ఉమ్మడి జిల్లాలో పురుషుల జనాభానే ఎక్కువగా ఉంది. 2011లో జరిగిన జనగణనలో మొదటిసారి పురుషుల జనాభా కంటే మహిళల జనాభా పెరిగింది.

అవకాశాలు అందిపుచ్చుకుంటున్న వైనం..

స్థానిక సంస్థల్లో 33శాతం నుంచి 50 శాతానికి రిజర్వేషన్లు పెంచిన తర్వాత సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలుగా మహిళల ప్రాధాన్యత విస్తృతమైంది. నాలుగు జిల్లాలుగా విభజన తర్వాత ఉమ్మడి జిల్లాలో నాలుగు జిల్లా పరిషత్‌లు ఏర్పడగా, ఈ రిజర్వేషన్ల కారణంగానే ప్రస్తుతం జెడ్పీ చైర్‌పర్సన్లుగా మంచిర్యాలకు నల్లాల భాగ్యలక్ష్మి, కుమురంభీం ఆసిఫాబాద్‌కు కోవ లక్ష్మి, నిర్మల్‌కు విజయలక్ష్మి వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 12 మున్సిపాలిటీలు ఉండగా, నలుగురు మహిళలు చైర్‌పర్సన్లుగా ఉన్నారు. బెల్లంపల్లిలో శ్వేత, క్యాతన్‌పల్లిలో జంగం కళ, చెన్నూర్‌లో అర్చన రాంలాల్ గిల్డే, భైంసాలో సబియా బేగం బల్దియాలను ఏలుతున్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అమలైన పక్షంలో రాజకీయంగా పలువురు నారీమణులు రాణించే అవకాశాలు ఉంటాయి.

ఆ రిజర్వేషన్లతో రాజకీయ స్థిరత్వం

స్థానిక సంస్థలకు 1995లో 33శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 52 జెడ్పీటీసీ స్థానాలకు 17మంది జిల్లా పరిషత్ సభ్యులుగా మహిళలు ఎన్నికయ్యారు. అలాగే అప్పట్లో 17మంది మండల పరిషత్ అధ్యక్షులుగా కొలువుదీరారు. అయితే ఆ తర్వాత సరైన ప్రాతినిధ్యం దక్కక పలువురు మహిళలు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించలేదు. అప్పట్లో జైనథ్ జెడ్పీటీసీ సభ్యురాలిగా చిట్యాల సుహాసినీరెడ్డి, తాంసి జెడ్పీటీసీ సభ్యురాలిగా గంగ్రత్ సుజాత వ్యవహరించారు. ఆ కాలంలోనే నిర్మల్ జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచిన సుమతీరెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రెండేళ్లకు పైగా పనిచేశారు. ఆ తర్వాత జైనథ్ జెడ్పీటీసీ సభ్యురాలు చిట్యాల సుహాసినీరెడ్డికి చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కింది. సుమతీరెడ్డి క్రియాశీల రాజకీయాలకు దూరం కాగా, చిట్యాల సుహాసినీరెడ్డి, గంగ్రత్ సుజాత ఇప్పటికీ క్రియాశీలకంగా ఉన్నారు. అలాగే అప్పట్లో స్థానిక రిజర్వేషన్ల కారణంగా ఎంపీపీగా ఎన్నికైన కోవ లక్ష్మి ఆ తర్వాత కాలంలో రాజకీయంగా అనేక ఉన్నత పదవులు అధిరోహించారు. ఎమ్మెల్యేగా వ్యవహరించారు. ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. తాజాగా బీఆర్ఎస్ నుంచి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఓటరు నమోదు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్ అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గరుడ యాప్, ఎన్‌వీఎస్‌పీ పోర్టల్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని టీటీడీసీని సందర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించారు. ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో స్రవంతి, ఆయా మండలాల తహసీల్దార్లు ఎస్.శ్రీనివాస్, శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ తదితరులున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

కైలాస్‌నగర్: తమ సేవలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో 24రోజుల పాటు సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెను గురువారం తాత్కాలికంగా విరమించారు. డీఈవో ప్రణీత కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరాన్ని సందర్శించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనలు వారికి వివరించారు. సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎస్‌పీడీ దేవసేన ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీంతో డీఈవో హామీ మేరకు సమ్మెను 48 గంటల పాటు తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ ప్రకటించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వస్తుందని భావిస్తున్నామని తెలిపారు. హామీ రాని పక్షంలో తిరిగి సమ్మెను యథావిధిగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం బాధ్యులు ప్రవీణ్, వెంకటి, ధరం సింగ్, సలీం, వెంకన్న, వినోద్, పార్థసారథి, రేణుక, సోమన్న, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో మోస్తరు వర్షం



ఆదిలాబాద్ పట్టణంలో కురుస్తున్న వర్షం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు తెరిపినిస్తూ కురిసిన వర్షంతో పట్టణం తడిసి ముద్దైంది. ఈ వర్షానికి చిరువ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొద్దిరోజులుగా చినుకు జాడ లేక ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం ఇచ్చింది. రానున్న మరో మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: దుర్గం మ్యాన్ పవర్ సొసైటీ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో 2023–2024 విద్యాసంవత్సరానికి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లలో ఖాళీ ఉద్యోగాల భర్తీకి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ దుర్గం శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీ పరిధిలోని జిల్లాలో అప్‌గ్రేడ్ చేయబడిన మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జేఎల్ బోటనీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, పీజీటీ, బయోసైన్స్, టీజీటీ, హిందీ బోధించే వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి, అర్హతగలవారు ఈ నెల 22నుంచి 24వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలోగల సొసైటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 7842282218, 9948170670 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఐటీడీఏ బీఈడీ కళాశాలలో 2023–25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం అక్టోబర్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్టోబర్ 17వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9440848073 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గణనాథుడికి ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పూజలు



వినాయకుడికి పూజలు చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కుమార్‌పేటకాలనీలో కుమార్ జనతా గణేశ మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన 48 అడుగుల ఎత్తైన వినాయక విగ్రహం వద్ద గురువారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పూజలు చేశారు. మండప నిర్వాహకుడు తోట పరమేశ్వర్, సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తదితరులున్నారు.

నేడు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ తీరు తెన్నులు, వ్యాధుల నియంత్రణకు మున్సిపల్ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై ఈ నెల 22వ తేదీన (శుక్రవారం) ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎ.శైలజతో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పట్టణ ప్రజలు తమ సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 93980 98484
సమయం: ఉదయం 11నుంచి 12గంటల వరకు.

ఇక డిజిటల్ 'ఆరోగ్యశ్రీ'

- కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ కసరత్తు
- రేషన్ డీలర్లకు ఈకేవైసీ బాధ్యతలు
- పేదల తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెర
- వైద్యానికి తప్పనున్న తిప్పలు



ఆరోగ్యశ్రీ ట్రస్ట్ లోగో

కైలాస్‌నగర్: జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవల కోసం సుదీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్న పేదలకు ఎట్టకేలకు ఊరట లభించింది. ఆహార భద్రత కార్డులు కలిగిన వారందరికీ ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదనుగుణంగా జిల్లా పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. రేషన్‌కార్డుదారుల వివరాల నమోదు ప్రక్రియ (ఈకేవైసీ) నిర్వహణ బాధ్యతలను రేషన్ డీలర్లకు అప్పగించింది. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త డిజిటల్ కార్డుల జారీతో పేదలకు ఇక తహసీల్దార్ చుట్టూ తిరిగే ఇక్కట్లు తొలగనున్నాయి.

ఎట్టకేలకు మోక్షం

దారిద్య్రరేఖకు దిగువనుండి రేషన్‌కార్డు కలిగిన నిరుపేదలు అనారోగ్యానికి గురైతే కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందేలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా కార్డులు జారీ చేసింది. వీటి ద్వారా ఎంతో మంది నిరుపేదలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సేవలు పొందారు. స్వరాష్ట్రం సిద్ధించాక డబ్ల్యూఏపీ కార్డులకు స్వస్తి పలికిన తెలంగాణ ప్రభుత్వం వాటి స్థానంలో ఆహార భద్రత కార్డు (ఎఫ్ఎస్‌సీ)లను జారీ చేసింది. ఈ కార్డులు పొందిన వారికి ఆరోగ్యశ్రీ కార్డులు లేకుండా పోయాయి. అయితే వైద్యసేవలు అవసరమైన వారు సంబంధిత తహసీల్దార్, ఆరోగ్య మిత్రల ధ్రువీకరణ పత్రాల ద్వారా వైద్యసేవలు పొందే వెసులుబాటును మాత్రం కల్పించింది. ఈ క్రమంలో పేదల ఇక్కట్లు గుర్తించిన ప్రభుత్వం అర్హులైన వారందరికీ డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలని తాజాగా నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందనున్నాయి.

ఈకేవైసీ నమోదు ఇలా..

రేషన్ కార్డుదారులు ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు కోసం డీలర్‌ను సంప్రదించినప్పుడు ఆధార్‌కు లింక్ కలిగిన మొబైల్ నంబర్‌ను తీసుకెళ్లాల్సి ఉంటుంది. డీలర్ ఆ నంబర్‌ను పీవోఎస్ డివైస్‌లో నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. దాని ఆధారంగా కార్డుదారుల వివరాలు కనిపిస్తాయి. కుటుంబ సభ్యుల పేరు, పుట్టిన తేదీ, జెండర్, హెడ్ ఆఫ్ ఫ్యామిలీ పేరు, చిరునామా, ఎఫ్ఎస్‌సీ కార్డు నంబర్ నమోదు చేస్తారు. ఈ వివరాల ఆధారంగా కార్డుదారుల బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ వివరాలను పరిశీలిస్తారు. వాటి ఆధారంగా ప్రత్యేక నంబర్‌ను క్రియేట్ చేస్తారు. తద్వారా ఆన్‌లైన్‌లోనే ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు జనరేట్ అవుతుంది. దాన్ని కార్డుదారులకు అందజేస్తారు.



వివరాలు నమోదు చేశాక ఇలా వస్తుంది

జిల్లాలోని మండలాలు: 18
చౌకధరల దుకాణాలు: 356
రేషన్‌కార్డుల సంఖ్య: 1,91,881
యూనిట్ల సంఖ్య: 6,40,515

రేషన్ డీలర్లకు బాధ్యతలు

కామన్ సర్వీసెస్ సెంటర్ (సీఎస్సీ) ద్వారా ఆరోగ్యశ్రీ కార్డులకు సంబంధించిన సేవలు జరగాల్సి ఉన్నప్పటికీ రేషన్ డీలర్లకు అదనపు ఆదాయం అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుదారుల ఈకేవైసీ నమోదు బాధ్యతలు వారికి అప్పగించింది. ఇందుకు గాను డీలర్లకు ఒక్కో రేషన్ కార్డుకు రూ.5 చొప్పున చెల్లించనుంది. డిజిటల్ కార్డులు కూడా తిరిగి డీలర్ల ద్వారానే కార్డుదారులు పొందాల్సి ఉంటుంది. ఇందుకు గాను రూ.3 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నగదును ప్రభుత్వమే సీఎస్సీ సంస్థ ద్వారా చెల్లించనుంది. దీంతో రేషన్ డీలర్లకు కొంత ఆర్థికంగా వెసులుబాటు కలుగనుంది.

ఈకేవైసీ నమోదు చేసుకోవాలి



ఆహారభద్రత కార్డుదారులందరికీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు అందించాలని నిర్ణయించింది. వీటిని పొందాలనుకునే వారు సంబంధిత రేషన్ డీలర్‌ను ఆధార్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ల ద్వారా సంప్రదించి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలి. తద్వారా ఆన్‌లైన్‌లోనే ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు జనరేట్ అవుతుంది.

– టీ కిరణ్‌కుమార్,
జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

కేసులు నమోదు చేయడం సరికాదు

ఎదులాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన అంగన్‌వాడీలపై పోలీసులు దౌర్జన్యంగా కేసులు పెట్టడం సరికాదని భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినీరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపితే ప్రభుత్వం పట్టించుకోకుండా అంగన్‌వాడీలపై కేసులు పెట్టడం శోచనీయమని తెలిపారు. వెంటనే అంగన్‌వాడీలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వంపైనే అంగన్‌వాడీల పోరాటం

అంగన్‌వాడీలు తమ హక్కుల సాధనకు ప్రభుత్వంపై పోరాడుతున్నారని, పోలీసుల మీద కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీన కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసనలో జరిగిన సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్లు అనేక పోరాటాలు చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి ఘటనలు ఎప్పుడూ చోటు చేసుకోలేదని తెలిపారు. సీఐటీయూ నాయకులు రెచ్చగొట్టడంతోనే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయని ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ జేఏసీతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ వెళ్లిన ఆదివాసీలు



నినదిస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు

బోథ్: లంబాడాలు, యానాది, సుగాలిలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న ధర్నాకు మండలంలోని పలు గ్రామాల నుంచి ఆదివాసీ సంఘం నాయకులు గురువారం వాహనాల్లో వెళ్లారు. ఢిల్లీకి వెళ్లినవారిలో సార్‌మెడిలు గంగారాం, లక్ష్మణ్, నాయకులు మేస్రం భూమన్న, భీంరావ్, భూమన్న, సుదర్శన్, భగవాన్, నరేశ్, పట్నాపూర్, పార్డి (బీ) రాయిసెంటర్లకు చెందిన వంద మంది ఆదివాసీలున్నారు.

క్లుప్తంగా

వెండి పాదాల బహూకరణ


పాదాలకు పూజలు చేస్తున్న భక్తులు

తానూరు: భోసిలో నెలకొల్పిన కర్రవినాయకుడికి భైంసా పట్టణానికి చెందిన గోవింద్‌వార్ రమ సాయినాథ్ దంపతులు గురువారం స్వామివారి ఆలయంలో పదకొండున్నర తులాల వెండి పాదాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వెండి పాదాలు బహూకరిస్తామని ముడుపులు కట్టామని, ఈ ఏడాది చెల్లిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు దంపతులను శాలువతో సన్మానించి కర్ర వినాయకుని చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మురళి, అధ్యక్షులు నాగనాథ్ ఉన్నారు.

జాతీయ కమిటీలో జిల్లా వాసికి చోటు


పూసం సచిన్

ఎదులాపురం: తమిళనాడు రాష్ట్రంలోని నమ్మక్కల్ పట్టణంలో నిర్వహించిన ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నాల్గవ మహాసభలకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు పూసం సచిన్ హాజరయ్యారు. ఈ సభకు దేశం నలుమూలల నుంచి 400మంది ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సభలో వివిధ ఆదివాసీ సమస్యలపై చర్చించి వాటిపై పలు పోరాటాల రూపకల్పనపై చర్చించారు. హక్కుల కోసం పోరాడడానికి ప్రత్యేకంగా జాతీయ కమిటీని నియమించగా అందులో పూసం సచిన్‌కు చోటు కల్పించారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముథోల్: ముథోల్‌లోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అభిషేక్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. 17ఇయర్స్ విభాగంలో భైంసాలో నిర్వహించిన పోటీల్లో అభిషేక్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అదే విధంగా పాఠశాలకు చెందిన విద్యార్థులకు స్వార్థిక్, ముత్యం, లలిత, వనితలు జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు, అభినందించారు.

మంత్రిపై అసత్య ప్రచారం చేసిన వారిపై కేసు

నిర్మల్‌టౌన్: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసిన వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు. సీఐ కథనం ప్రకారం... మంత్రిని అవమానిస్తూ వీడియోలు, దొంగకట్లతో గెలిచాడంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్, సాయి చెల్లె (సాయన్న), విజ్ఞు, నరేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇరువురి రిమాండ్

ఎదులాపురం: సమస్యల పరిష్కారంలో భాగంగా అంగన్‌వాడీలు ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. నిరసన క్రమంలో ఎస్సైపై దాడికి ప్రోత్సహించినందుకు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కిరణ్, దేవేందర్‌లను రిమాండ్‌కు తరలించినట్లు టుటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

వినాయకుడు

నవరాత్రుల్లో భాగంగా వినాయకుడు ఘనమైన పూజలు అందుకుంటున్నాడు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో ఉత్సవాల్లో భాగంగా వివిధ వాడల్లో, గ్రామాల్లో భక్తుల దర్శనం కోసం వివిధ రూపాల్లో కొలువుదీరాడు. పలువురు సభ్యులుగా ఏర్పడి విఘ్నేశ్వరుడిని ఏళ్లుగా ఏర్పాటు చేస్తూ భక్తిభావాన్ని చాటడంతో పాటు ఐక్యంగా ముందుకుసాగుతున్నారు. అలాగే పలుచోట్ల పర్యావరణానికి హాని లేకుండా మట్టి, పేపర్‌తో గణపతి ప్రతిమలను తయారు చేయించి పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక ఉత్సవాలు భక్తిభావంతో పాటు ప్రజల్లో సక్యతను సైతం చాటేందుకు ఎంతగానో దోహదం చేస్తున్నాయి. ఆయా జిల్లాలో పలువురు గ్రూపులుగా ఏర్పడి ఏళ్లుగా లంబోదరుడిని నెలకొల్పుతున్న పలు మండపాల ప్రత్యేకతపై కథనం..

గరుడ పక్షిపై గణనాథుడు


గరుడపక్షిపై కొలువుదీరిన గణనాథుడు

బోథ్: మండల కేంద్రానికి చెందిన లయన్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు అందరిని ఆకట్టుకుంటోంది. రెక్కలతో ఎగురుతున్న గరుడపక్షిపై గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గణ నాథున్ని చూడటానికి అనేకమంది వస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

రైతులను ఏకం చేసిన లంబోదరుడు


కుంటాలలో రైతును దీవిస్తూ ఉన్న వినాయకుడు..

కుంటాల: ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ వినాయక విగ్రహాల ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేశారు. ఆ మాటను నిలబెట్టేందుకు కుంటాలకు చెందిన రైతులు ఏకమయ్యారు. కాలనీలో 20మంది రైతులంతా మణికంఠ గణపతి కార్యవర్గంగా ఏర్పడ్డారు. 11ఏళ్లుగా వినాయకుడిని నెలకొల్పుతున్నారు.

ప్రతీ పనిలో తోడుండాలని..



మనం చేసే ప్రతీపనిలో గణపతి తోడుండాలనే సంకల్పంతో రైతులందరం కలిశాం. 11ఏళ్లుగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నాం. పంటలు బాగా పండి కుటుంబాలు సంతోషంగా ఉండడంతో రైతుకు సహాయం చేస్తున్న గణపతి విగ్రహాలను నెలకొల్పుతున్నాం.

– జక్కుల ముత్యం, యువరైతు, కుంటాల

మతసామరస్యాన్ని చాటిన వైద్యుడు


విగ్రహం వద్ద పూజలు చేస్తున్న కేహెచ్ ఖాన్, నాయకులు

ఖానాపూర్: పట్టణా నికి చెందిన ఖాజా క్లిని క్ ఆస్పత్రి వైద్యుడు కేహెచ్ ఖాన్ తన ఆస్పత్రిలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. ఈ నెల 18న విగ్రహాన్ని ప్రతి ష్ఠించిన కేహెచ్ ఖాన్ మూ డు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం రాత్రి భక్తిశ్రద్ధల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఇందులో హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సురేష్, శెట్టిశ్యాం, మాజీ సర్పంచ్ నేరెళ్ల సత్యనారాయణ, బీజేపీ జిల్లా నాయకులు మదిర సత్యనారాయణ ఉన్నారు.

పదేళ్లుగా విభిన్న ఆకృతుల్లో..


వినాయకుడి పూజలో యూత్ సభ్యులు

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో ధగడ్ యూత్ సభ్యులు ప్రతియేటా వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో విగ్రహాలను ప్రజలకు అవగాహన కల్పించే రీతిలో ప్రతిష్టిస్తున్నారు. ఈసారి ఉయ్యాలలో గణపతిని ఆకట్టుకునేలా ఉంది.

మట్టి గణపతి



భైంసా: భైంసాలోని సాక్షి రెస్టారెంట్‌లో ఐదు అడుగుల మట్టి గణపతి ఆకట్టుకుంటుంది. అక్కడ పనిచేసే ఒరిస్సా కార్మికులు మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఒరిస్సాకు చెందిన కార్మికుడు తపన్‌దుత్త మట్టి గణపతిని తయారుచేశాడు. ఈ గణపతిని చూసేందుకు పలువురు భక్తులు తరలివస్తున్నారు.

మట్టితోనే తయారు చేస్తాం



వేలల్లో ఖర్చుచేసి విగ్రహాలను ప్రతిష్టించకుండా ఇలా మట్టితో తయారు చేస్తే పర్యావరణానికి మేలు. మా ప్రాంతంలో ఇలా మట్టితోనే విగ్రహాలు తయారు చేసుకుంటాం. ఒరిస్సా నుంచి వచ్చినమేమంతా యేటా వినాయక చవితిని జరుపుకుంటాం. ఈసారి మట్టితో ఐదు అడుగుల విగ్రహాన్ని తీర్చిదిద్దాను.


– తపన్‌దుత్త

ఎకో ఫ్రెండ్లీ పేపర్ మట్టి గణపతి


శివలింగంపై కొలువుదీరిన గణపతి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెంది న వంశీకృష్ణ పదమూడేళ్లుగా పేపర్, మట్టి గణపతులను తయా రు చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆదర్శ యూత్ యువకుల సాయంతో గణనాథులను తయా రు చేస్తూ పర్యావరణా నికి హాని కలగకుండా ఎకో ఫ్రెండ్లీ పేపర్, మట్టి గణపతి విగ్రహా లను తయారు చేస్తూ స్థానిక పెద్ద హనుమా న్ ఆలయంలో ప్రతిష్టిస్తున్నారు.

మహాగణపతి.. నమోనమామి


48అడుగుల గణపతి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహణకు 8 దశాబ్దాల చరిత్ర ఉంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఆదిలాబాద్ జిల్లాలోనే గణేష్ చతుర్థి ఉత్సవాలను ఎంతో వైవిధ్యంగా నిర్వహిస్తారనే పేరు ఉంది. పట్టణంలోని కుమార్‌పేట్ కాలనీలో 1979 నుంచి ప్రతిష్టిస్తున్న కుమార్ జనత గణేష్ మండలికి ఎంతో ప్రత్యేకత ఉంది. స్థానికంగా నూతిమీది గణపతిగా వ్యవహరించే ఈ వినాయక మండలి ఆధ్వర్యంలో ప్రతీ ఏటా భారీ లంబోదారున్ని ప్రతిష్టిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈసారి సైతం 48అడుగుల భారీ గణనాథున్ని ప్రతిష్ఠించడం విశేషం.

33ఏళ్లుగా నిర్విఘ్నంగా గణపతి ఏర్పాటు


శివగణేష్ యూత్ ఆధ్వర్యంలో..

తాంసి: మండల కేంద్రంలో శివ గణేష్ మండలి ఆధ్వర్యంలో 33ఏళ్లుగా నిర్విఘ్నంగా గణేష్ విగ్రహన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఏటా వివిధ రకాల ఆకృతుల్లో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వినాయక చవితి కోసం పోగు చేసే డబ్బులను సైతం ఆదా చేస్తూ శివాలయం నిర్మాణానికి సైతం డబ్బులను అందిస్తున్నారు. అక్కడ యువత అంతా ఐక్యంగా ఉంటూ వేడుకలు నిర్వహించుకుంటారు.

విద్యుత్ అధికారులపై గ్రామస్తుల దాడి


అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండలంలోని గిమ్మ గ్రామంలో విద్యుత్ బిల్లుల వసూలుకు వెళ్లిన అధికారులపై గ్రామస్తులు దాడి చేశారు. పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్‌పీడీసీఎల్ డీఈ హరికృష్ణ, ఏఈ గంగాధర్, లైన్‌ఇన్‌స్పెక్టర్ మోహన్, లైన్‌మన్ ప్రేమ్‌కుమార్, జేఎల్‌ఎం సతీష్, మరో ముగ్గురు అన్‌మ్యాన్డ్ వర్కర్స్ బుధవారం సాయంత్రం గ్రామానికి వెళ్లారు. 210 కనెక్షన్లకు సంబంధించి రూ.36లక్షలు బిల్లు పెండింగ్‌లో ఉంది. బిల్లు చెల్లించకపోవడంతో ఎస్సీ కాలనీలో 150ఇళ్ల కనెక్షన్లు తొలగించారు. దీంతో గ్రామస్తులు కోపోద్రిక్తులై అధికారులపై దాడి చేశారు. అందరినీ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి కరెంటు సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు చివరకు విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించారు. ఎస్సై పురుషోత్తం సంఘటన స్థలానికి చేరుకొని అధికారులను అక్కడి నుంచి ఆదిలాబాద్‌కు తరలించారు. కాగా, నోటీసు ఇవ్వకుండా కరెంట్ కట్ చేయడం సరికాదంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీలకు 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన కూడా అధికారులు వేధించడం సరికాదని వాపోయారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను దూషించడం, దాడికి పాల్పడడంతో గ్రామానికి చెందిన పలువురిపై ఏఈ గంగాధర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

ఎదులాపురం: రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న జక్కుల శిల్పపై గురువారం ఓ రోగి బంధువులు దాడికి పాల్పడ్డారు. టుటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. రోగి బంధువులైన ముజాహిద్, అతడి తల్లి రేష్మ బంధువుని పరామర్శించేందుకు గురువారం ఆస్పత్రిలోని గానిక్ వార్డుకు వెళ్తున్నారు. వార్డు క్లీనింగ్ సమయంలో సెక్యూరిటీ గార్డు జక్కుల శిల్ప గేటు వద్ద లోనికి వెళ్లకుండా వారిని అడ్డుకుంది. క్లీనింగ్ చేస్తున్నారని, కొంత సమయం వేచి ఉండాలని కోరగా రేష్మ ఆమెను దూషించగా ముజాహిద్ స్టూల్‌తో దాడికి పాల్పడ్డాడు. శిల్ప ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేఆర్కే కాలనీలో గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పేకాటాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి రూ.1,850 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రైతు ఆత్మహత్య

తలమడుగు: ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ధనశ్రీ వివరాల ప్రకారం.. కొత్త నందిగామ గ్రామనికి చెందిన సేడ్మాకి భీంరావు(49) తనకున్న మూడెకరాల పోడుభూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు కుమార్తెలను ఎలా చదివించాలని నిత్యం మదనపడేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి పశులపాక సమీపంలో పడిపోయాడు. కుటుబీ కులు గమనించేలోగా మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ ఎక్స్‌రోడ్డు సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు అదుపు తప్పి కారుబోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ వివరాల మేరకు... మహారాష్ట్రలోని యావత్ మాల్ జిల్లా పంధర్కవాడ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మారుతీ ఎక్స్ క్రాస్ కారులో నాందేడ్ వెళ్తుండగా 61వ జాతీయ రహదారిపై మండలంలోని నందన్ ఎక్స్ రోడ్డు సమీపంలో కారు హ్యాండిల్ లాక్ పడటంతో ప్రమాదవశాత్తు పంట పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎదులాపురం: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పర్డాన్ సాంగి గ్రామానికి చెందిన మధుకర్ (48) రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. టుటౌన్ పోలీసు అధికారి ముకుంద్‌రావు కథనం ప్రకారం.. పర్డాన్ సాంగికి చెందిన మధుకర్ మద్యానికి బానిసయ్యాడు. పనిపాట లేకుండా మద్యం సేవిస్తుండడంతో కుటుంబీకులు మద్యం మానేయాలని వారించేవాడు. ఈనెల 18 పశువుల పాకలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు.

ఆదివాసీ మహిళకు ఎంతకష్టం

- పురుటినొప్పులతో తల్లడిల్లిన నిండు గర్భిణి
- వాగు కారణంగా గ్రామానికి చేరుకోని 108
- వానలో వాగుదాటి పురుడుపోసిన సిబ్బంది
- తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలింపు


భీంబాయి, శిశువుతో 108 ఈఎంటీ శంకర్

ఉట్నూర్‌రూరల్: ఓ వైపు జోరు వాన కురుస్తోంది. మరో వైపు నిండు గర్భిణి పురుటినొప్పులతో ప్రసవ వేదన పడుతోంది. ఆస్పత్రికి తరలించాలంటే మధ్యలో వాగు దాటాల్సి ఉంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వాగు అవతలి భీంగూడ వద్దకు మాత్రమే రాగలిగారు. కానీ.. ఆమెకు ఎలాగైనా పురుడుపోయాలని తపనపడ్డారు. అతికష్టం మీద వాగు దాటి వచ్చారు. మహిళకు పురుడు పోసి తల్లీబిడ్డను కాపాడగలిగారు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం మండంలోని చిన్నుగూడ గ్రామానికి చెందిన నిండు గర్భిణి ఆత్రం భీంబాయికి పురిటినొప్పులు వచ్చాయి. గ్రామస్తులు 108కు సమాచారం అందించారు. చిన్నుగూడ నుంచి వాగు వరకు వస్తున్న క్రమంలో భీంబాయికి పురుటినొప్పులు అధికమయ్యాయి. దీంతో అక్కడే ఆగిపోయారు. విషయం తెలుసుకున్న వాగు అవతలివైపు భీంగూడ వద్దకు చేరుకున్న 108 సిబ్బంది స్పందించారు. భీంగూడ వద్దే అంబులెన్స్‌ను నిలిపి కాలినడకన ప్రవహిస్తున్న వాగు దాటి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గిరిజన సంప్రదాయం కారణంగా ప్రసవ మహిళకు గ్రామస్తులు దూరంగా ఉంటారు. దీంతో చేసేదేమీలేక ఈఎంటీ శంకర్, పైలట్ సచిన్ అన్నీ తామై వాగు ఒడ్డున వర్షంలో భీంబాయికి గొడుగు కిందే పురుడు పోశారు. ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే ఆమెను స్ట్రెచర్‌పై వాగులోంచి మోసుకువెళ్లి అంబులెన్స్ వద్దకు చేర్చారు. ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆపద నుంచి మహిళను రక్షించడంతో గ్రామ పటేల్, భీంబాయి కుటుంబీకులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేటు ఎత్తివేత



భైంసాటౌన్: ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతోంది. గురువారం ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ప్రాజెక్టు అధికారులు ఒక గేటు ఎత్తి 3700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టం కొనసాగుతుంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన బుర్రి శ్రీనివాస్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11న శ్రీనివాస్ కూలిపనికి వెళ్లాడు. మరుసటి రోజు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి 20న మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఇంగు శంకర్, తాటి మల్లేశ్ చితకబాదడంతోనే మృతి చెందాడని మృతుని భార్య శ్రీలత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

క్రీడల్లో రాణించడానికి పేదరికం అడ్డురాదు

- ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: క్రీడల్లో రాణించడానికి పేదరికం అడ్డురాదని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం ఉమ్మడి జిల్లా అండర్ 17 బాలికల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మీరాబాయి చాను ఎంతో కష్టపడి కామన్వెల్త్ పోటీల్లో పతకాన్ని సాధించారన్నారు. అటువంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో మెరుగైన నైపుణ్యాలను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ఈ దిశగా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 11 జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని ప్రిన్సిపల్ విద్య తెలిపారు. తొలి రోజు వాలీబాల్, టెన్నికాయిట్, క్యారమ్ పోటీలను నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పోటీలు మూడు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కాంతారావు, పెటా సెక్రటరీ స్వామి పాల్గొన్నారు.

గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

ఖానాపూర్: గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) జాతీయాధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ నర్సాగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని సీఎం రావు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మూడో జిల్లా మహాసభల్లో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ సెక్రటరీ జనరల్ సిద్దిరాములుగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు నర్సింలుగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు కిరణ్, స్వామి, సంజీవ్, శ్రీనివాస్, మురళి, నారాయణ, నాగరాజుగౌడ్ హాజరై మాట్లాడారు. జనాభాలో 12శాతం ఉన్న గౌడ కులస్తులకు దామాషా ప్రకారం చట్టసభల్లో సీట్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీతా వృత్తిని మత్తుపానియాల జాబితా నుంచి తొలగించాలన్నారు. జనగామ జిల్లాను సర్వాయిపాపన్న జిల్లాగా మార్చాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు వెంటనే పంపిణీ చేయాలని తెలిపారు. పాపన్నగౌడ్ పోరాడిపాలించిన ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. గీతా కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని ప్రకటించడంతో పాటు రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. కార్మికుల ప్రమాదబీమాను రూ.10లక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లాగౌడ్, రాజారాంగౌడ్, చిన్ననర్సాగౌడ్, శంకర్‌గౌడ్, రాజేందర్ గౌడ్, వెంకాగౌడ్, భూమన్న ఉన్నారు.